నార్పల విద్యుత్ సబ్ స్టేషన్లో కంపచెట్లు తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - నార్పల

మండల కేంద్రంలోని స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్లో అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టారు. 'నార్పల విద్యుత్స్టేషన్‌లో ముళ్లపొదలు' శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిచన కథనానికి విద్యుత్ ఉన్నత అధికారులు స్పందించారు. ఈ మేరకు ఆదివారం జెసిబి ద్వారా సబ్ స్టేషన్ పరిసరాల్లో పెరిగిన కంప చెట్లు పిచ్చి మొక్కలను తొలగించారు దీంతో సబ్ స్టేషన్ పరిసరాల్లో నివాసముండే ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రజాశక్తికి ప్రత్యేక అభినందనలు తెలిపారు..

జెసిబితో కంపచెట్లు తొలగిస్తున్న దృశ్యం

పిఎబిఆర్‌లో కదలికొచ్చేనా ?

◆ సామర్థ్యం మేరకు నీటి నిల్వకు చర్యలుండేనా ..?

◆ మూడు దశాబ్దాలుగా ఎదురుచూపులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలోనున్న అతి పెద్ద రిజర్వాయరు పెన్నహోబిలం రిజర్వాయరు. 11 టిఎంసిల నిలువ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ రిజర్వాయరులో సగానికి కూడా నీటిని నింపుకోలేని పరిస్థితి దశబ్దాలుగా కొనసాగుతోంది. 1994లో ప్రాజెక్టు నిర్మాణం పూర్తయింది. నిర్మాణ సమయంలో స్పిల్‌వే నాణ్యతా లోపాలతో లీకేజీలు ఏర్పడ్డాయి. వీటిని అరికట్టేందుకు ఇప్పటి వరకు రూ.13 కోట్లకుపైగా నిధులను వెచ్చించారు. కాని పెద్దగా ప్రయోజనం చేకూరలేదు. ఇప్పటికీ లీకేజీలు కొనసాగుతూనే ఉన్నాయి. దీన్ని పూర్తి స్థాయిలో అరికట్టాలంటే జియోమెమ్రైన్ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. దీనికి ప్రతిపాదనలు కూడా పలుదఫాలుగా ప్రభుత్వానికి పంపారు. అయితే చర్యలు మాత్రం తీసుకున్న దాఖలాల్లేవు.

పూర్తవని భూసేకరణ

ప్రాజెక్టు నిర్మాణ లోపాలతో పూర్తి సామర్థ్యంతో నీటిని నింపే పరిస్థితి లేకపోవడం ఒకవైపు ఉంటే మరోవైపు భూసేకరణ కూడా ఇప్పటికీ పూర్తవ లేదు.11 టింఎంసిలు నిలువ ఉంచాలంటే ఇంకా 2500 ఎకరాల భూసేకకరణ జరగాల్సి ఉంది. మూడు దశాబ్ధాలుగా అనేక ప్రభుత్వాలు మారినా ఇప్పటికీ భూసేకకరణ ప్రక్రియ పూర్తవలేదు. జిల్లా కలెక్టరు వినోద్‌కుమార్ బుధవారం హెచ్ఎల్‌సి కార్యాలయం పరిశీలించి పూర్తి సామర్థ్యంతో నింపాలని చెప్పారు. అలా నింపాలంటే ముందుగా భూసేకరణ పూర్తి చేయాల్సి ఉంటుంది.

పిఎబిఆర్ లింకు కెనాల్ సామర్థ్యం తక్కువ

పిఎబిఆర్‌ను పూర్తి సామర్థ్యంతో నీటితో నింపాలంటే పిఎబిఆర్ లింకు కెనాల్ కెపాసిటీని పెంచాల్సి ఉంటుంది. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా 1800 క్యూసెక్కుల నీరొస్తే పిఎబిఆర్ నిండుతుంది. అయితే లింకు కెనాల్ కు 800 క్యూసెక్కులు మాత్రమే సామర్థ్యం ఉంది. దీని ప్రవాహ సామర్థ్యం పెంచకపోకపోవడంతో డ్యామ్‌కు నీటిని సకాలంలో తీసుకోలేకపోతున్నారు.

ఆయకట్టుకూ ఇక్కట్లు

కెసి కెనాల్ డైవర్షన్ ద్వారా పది టిఎంసిల నీళ్లు జిల్లాకు కేటాయింపులున్నాయి. ఈ నీటిని పిఎబిఆర్ డ్యామ్ ద్వారా కుడి కాలువ, ధర్మవరం కాలువ, పులివెందుల బ్రాంచ్ కెనాల్ కలిపి 50 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరందని పరిస్థితి ఉంది.

ఇప్పటికైనా నిధులివ్వాలి ..

ఇప్పటికైనా ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు కేటాయించాలన్న డిమాండ్ వస్తోంది. సిపిఎం అక్టోబరు 15 నుంచి 21వ తేదీ వరకు బస్సు యాత్ర చేపట్టింది. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసింది. బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సిపిఎం డిమాండ్ చేస్తోంది.

ప్రజల ఆస్తులను కార్పొరేట్లకు దోచిపెడుతున్న కేంద్రం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్

ప్రజాశక్తి - కళ్యాణదుర్గం

ప్రధాని నరేంద్ర మోడీ కార్పొరేట్ సంస్థలకు వంతు పాడుతూ దేశ ప్రజల ఆస్తులను వాటిని దోచిపెడుతున్నారని సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్ర కుమార్ విమర్శించారు. ఆదివారం పట్టణంలోని వివేకానంద ప్రైవేట్ కళాశాలలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ అధ్యక్షతన ప్రజాసంఘాల సమన్వయ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ప్రధాని మోడీ కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రత్యేక ప్రదర్శన కార్యక్రమానికి సంబందించిన కరపత్రాలను ఈసందర్భంగా విడుదల చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ మోడీ నిర్వాహకం వల్ల దేశంలో మరోసారి స్వాతంత్ర పోరాటం తప్పదని హెచ్చరించారు. ఎవరి ప్రయోజనాల కోసం రూ. 165 లక్షల కోట్లు అప్పు చేశారని నిలదీశారు. 90శాతం ప్రజల ఆస్తులను కార్పొరేట్ కంపెనీల వద్ద తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. పదేళ్ల మోడీ పాలనలో ఆదాని ఆస్తులు ప్రపంచంలోనే రెండో స్థాయికి చేరుకున్నాయన్నారు. పలు పన్నుల రూపంలో దేశానికి వస్తున్న ఆదాయం ఎటు వెళ్లిందని ప్రశ్నించారు. మోడీ పాలనలో రూ. 18 వేల కోట్ల ఎల్ఐసి దివాలా తీసిందని, పది లక్షల కోట్ల రూపాయలు ఆవిరి అయిపోయాయనని అన్నారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్, నిత్యవసర ధరలు అమితంగా పెంచి ప్రజలపై పెను భారం మోపారన్నారు. బడా పారిశ్రామికవేత్తలకు అనుగుణంగా చట్టాలు సవరిస్తూ ప్రజలను అడ్డంగా దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44వ కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. భిన్నత్వంలో ఏకత్వం ఉన్న దేశాన్ని కేంద్రంలో మతోన్మాద బిజెపి పాకిస్తాన్ ఆఫ్ఘనిస్తాన్ లాంటి మత రాజ్యాలుగా మార్చేందుకు ప్రయత్నిస్తోందని మర్శించారు. రోజురోజుకు దేశంలో నిరుద్యోగం పెరిగిపోతోందన్నారు. యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రధాని మోడీ పూర్తిగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో కార్మిక, కర్షకులు ఏకతాటిపై వచ్చి మోడీ వ్యతిరేక విధానాలను పూర్తిగా ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, రైతు సంఘం,ం ఏపీ కార్మిక రైతు కూలీ సంఘం నాయకులు నాగమణి, రాజేష్ రత్నం, శివారెడ్డి, రాముడు, పరమేష్, గోపాల్, రాయుడు, రాఘవేంద్ర, రంగనాథ్, కృష్ణుడు, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

హెచ్‌ఎల్‌సి వద్ద పోలీసుల పహారా

ఆయకట్టు రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

ప్రజాశక్తి - నార్పల

మండల పరిధిలోని హెచ్ఎల్సీ పరిసరాల్లో పోలీసు పహారా ఏర్పాటు చేశారు. హెచ్ఎల్‌సికి నీరు విడుదల చేయడంతో అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. హెచ్ఎల్‌సి చివరి ఆయికట్టు వరకు నీరు చేరడం లేదని గతంలో కూడా డిస్ట్రిబ్యూటర్లకు నీళ్లు వదిలే విషయంలో పలు గ్రామాల ప్రజలు గొడవలకు దిగారు. ఈ నేపథ్యంలో చివరి ఆయకట్టు వరకు నీరు రావడం లేదని రైతులు ఆందోళన చెందుతుండడంతో హెచ్ఎల్‌సి కెనాల్‌ను వారం క్రితం తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి, మూడు రోజుల క్రితం ధర్మవరం టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తదితరులు హెచ్ఎల్‌సిని, తుంపరడీప్‌కట్‌ను పరిశీలించి రైతులందరూ సమన్వయంతో ఎవరికి వచ్చే నీరు వారు అధికారిక కేటాయింపుల ప్రకారం తీసుకొని చివరి ఆయికట్టు వరకు నీరు చేరే విధంగా చూడాలని సూచించారు. అయినా కూడా ఎక్కడికక్కడ హెచ్ఎల్‌సి నీరు పక్కదారి పడుతోందని కెనాల్ నీరు చివరి అయకట్టు వరకు చేరి, సుబ్బరాయ సాగర్‌కు కెనాల్ నీరు వెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈసందర్భంగా పోలీసులు ఆయా గ్రామాల్లోని ఆయకట్టు రైతులతో నీటివిడుదలపై చర్చిస్తున్నారు. ఈ నేపథ్యంలో హెచ్ఎల్‌సి మొత్తం పోలీస్ పహారా ఏర్పాటు చేశారు. పోలీసులు హెచ్ఎల్‌సి వద్ద రాత్రి పగలు షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తున్నారు.

'కొన్ని చీకట్లు.. ఓ వెలుతురూ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

జిల్లా గ్రంథాలయంలో కవి సమ్మేళనం

ప్రజాశక్తి-అనంతపురం

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సంస్థ కార్యదర్శి రమ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి కొత్తపల్లి సురేష్, గోసల నారాయణస్వామి, కోటిగారి వన్నప్ప, మధురశ్రీ, లీలా మనోహర్, వడ్డీ సుధాకర్, అంకే శ్రీనివాసులు, విశ్వనాథరెడ్డి, లక్ష్మీ శ్యామ్, ఎ.ఎ.నాగేంద్ర, జూటూరు షరీఫ్, జి.అశోక్‌కుమార్, సి.ఆకుల రఘురాం, షేక్ కంబదూరు నబిరసూల్, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక జీవిత సంఘర్షణలకు ప్రతిబింబాలే 'ప్రగతి' కథలు

యోగి వేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎం.వినోదిని 'కొన్ని చీకట్లు.. ఓ వెలుతురూ' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం

ఆధునిక జీవిత సంఘర్షణలకు ప్రతిబింబాలే రచయిత్రి ప్రగతి రచించిన కథలు అని యోగి వేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎం.వినోదిని అన్నారు. ఆదివారం నగరంలోని ఎన్‌జిఒ హోంలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో ప్రగతి రచించిన 'కొన్ని చీకట్లు.. ఓ వెలుతురూ' అనే కథా సంపుటి పరిచయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వినోదిని మాట్లాడుతూ అమ్మ మనసుతో ప్రగతి కథా సాహిత్య సృజన చేశారన్నారు. ఆధునిక జీవితంలోని సౌందర్యం, సంఘర్షణలను అక్షరబద్ధం చేశారని విశ్లేషించారు. ఎదిగే వయసులో ఆడపిల్లల ఆలోచనలు, అలజడులను సహానుభూతితో అర్థం చేసుకున్నప్పుడే ఆధునికత సాధ్యపడుతుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కవి, విమర్శకులు తూముచర్ల రాజారామ్ మాట్లాడుతూ వ్యక్తిగత స్వేచ్ఛను గుర్తించాల్సిన అవసరాన్ని ఆధునిక సమాజంలో మనుషులు మరింత ఆధునికం కావాల్సిన సందర్భాలను ఈ కథలో వివరిస్తున్నాయన్నారు. కథలపై జరిగిన చర్చకు సమన్వయకర్తలుగా డాక్టర్ అంకె శ్రీనివాస్, డాక్టర్ హెచ్ పల్లవి వ్యవహరించారు. జీవితంలోని సున్నితత్వం, సమాజంలో వెలుగు చూడని కోణాలను మన ముందుకు తీసుకొచ్చారని డాక్టర్ అంకె శ్రీనివాస్ అన్నారు. డాక్టర్ పల్లవి మాట్లాడుతూ సమాజానికి ప్రగతి సద్విమర్శల ద్వారా రచయిత కలం మరింత పదునెక్కుతుందన్నారు. సంపుటిలోని పదహారు కథలపైన రెండు సెషన్లుగా జరిగిన చర్చలో అరుణాకాకి, చంద్రశేఖర శాస్త్రి, చిలుకూరి దీవెన, యమునారాణి, శేషగిరి రాయుడు, శోభామణి, సంగాలు, హేమమాలిని ఒక్కొక్కరు రెండు కథలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. రాయచోటి నుండి విచ్చేసిన డాక్టర్ వెంకటనారాయణ ప్రగతి రాసిన కథలలో శ్రామిక మహిళలు అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు, సామాజిక కార్యకర్తలు యాములపల్లి నర్సిరెడ్డి, రాధేయ, ఉప్పరపాటి వెంకటేశులు, ఎస్ఎం.బాషా, సత్యబోస్, గోవిందరాజులు, జెట్టి జైరామ్, తరిమెల అమర్నాథరెడ్డి, చెన్నా రామ్మూర్తి, జూటూరు తులసీదాస్, హిదయతుల్లా, నాగలింగమయ్య, భానుజ, ప్రజ్ఞా సురేష్, రవిచంద్ర, రాఘవేంద్ర, కొత్తపల్లి సురేష్, రియాజుద్దీన్, డాక్టర్ షరీఫ్, ప్రిన్సిపాల్ జనార్దన్‌రెడ్డి, శశికళ, సత్యనారాయణరావు, అధ్యాపకులు శివచంద్ర, శైలజారాణి, లక్ష్మీకాంత్, శేషారెడ్డి, శ్యాంకుమార్, పావని, మాధవి, కృష్ణవేణి, రవిశంకర్, రాధిక, బాలరంగయ్య, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేద్దాం

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

ప్రజాశక్తి - ఉరవకొండ

50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహించే యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప పిలుపునిచ్చారు. ఆదివారం ఉరవకొండ జోన్ యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను ఉరవకొండలోని సివివి నగర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వర్ణోత్సవ మండలం మహాసభల సందర్భంగా ప్రధాన రహదారి గుండా ర్యాలీ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి సంజీవ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు మాట్లాడుతూ యుటిఎఫ్ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలు మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహించుకున్నట్లు తెలిపారు. స్వర్ణోత్సవ వేడుకలలో భాగంగా 2025 జనవరి 5,6,7,8 తేదీలలో కాకినాడలో రాష్ట్రస్థాయి మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 50 సంవత్సరాల కాలంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాటాలు చేసి వాటి పరిష్కారానికి శక్తి వంచన లేకుండా యుటిఎఫ్ కృషి చేసిందన్నారు. ఉరవకొండలో యుటిఎఫ్ కార్యాలయానికి శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు వేగవంతంగా చేపడుతున్నట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వలన జీవో నెంబర్ 117ను అమలు చేయడంతో అనేక పాఠశాలలు విలీనం కావడంతో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. దీంతో పాటు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయిందన్నారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను విద్యారంగంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు మేలైన ఒపిఎస్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాకినాడలో జరిగే స్వర్ణోత్సవ మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యుటిఎఫ్ ఉపాధ్యాయులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్పచౌదరి, శ్రీనివాసులు, జయరాములు, పావన మురళి, రఘు, లక్ష్మీనారాయణ, మహిళా నాయకులు పద్మావతి, శ్రావణి, శ్రీదేవి, హేమలక్ష్మి, వెంకటేశ్వర్లు, ఇస్లాం బాష, వేణుగోపాల్, ఎర్రిస్వామి, బండయ్య, నాగరాజు, చంద్రమోహన్, శ్రీధర్, చంద్రశేఖర్, మధుబాబు, రవిచంద్ర, శివప్రసాద్, ధనుంజయ వర్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : ఎఎస్పీ

ప్రజాశక్తి సింగనమల

క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు ఉత్తేజాన్ని ఇస్తాయని అదనపు ఎస్పీ మల్లికార్జునవర్మ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తరిమెలలో ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. క్రీడల్లో 22 జట్లు పాల్గొని తమ ప్రతిభను కనబరిచాయి. వాలీబాల్ పోటీల్లో మొదటి బహుమతి తరిమెల, రెండో బహుమతి ఆగళి, మూడో బహుమతి గార్లదిన్నె, నాలుగో బహుమతి ఎంఎం పల్లి కైవసం చేసుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మారుమూల ప్రాంతం తరిమెలలో క్రీడా పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శరత్‌చంద్ర, సర్పంచి బిల్లగండ్ల ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఎస్పీ మల్లికార్జునవర్మ

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-రాయదుర్గం

విద్యార్థి సంఘం నాయకుల అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ హెచ్చరించారు. చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ, పట్టణ అధ్యక్షుడు వలిని ఎస్ఐ బాలరాజు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలంటూ చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తుండటంతో ప్రభుత్వం అరెస్టులకు పాల్పడటం తగదన్నారు. శనివారం జరిగిన చర్చలతో కార్యక్రమాన్ని నెలరోజులపాటు వాయిదా వేయాలని తాము తీర్మానించినప్పటికీ పోలీసులు తమను అరెస్టు చేసి అదుపులో తీసుకోవడం తగదన్నారు. అరెస్టులకు భయపడే లేదని, విద్యార్థి సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు శివను అదుపులోకి తీసుకుంటున్న ఎస్ఐ బాలరాజు

ప్రజలకు చేరువగా గ్రంథాలయ సేవలు

ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గ్రంథాలయాల సేవలను ప్రజలు, విద్యార్థులకు చేరువ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి,రమ అన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 73 గ్రంథాలయాల ద్వారా ప్రజలకు విజ్ఞానాన్ని అందిస్తున్నామన్నారు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడారు.

ప్రశ్న : డిజిటల్ లైబ్రరీ సేవలు ఎలా ఉన్నాయి?

జవాబు : రాష్ట్రంలోనే ప్రథమంగా అనంతపురం ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వం డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు ఏర్పాటు చేసింది. ఎన్నో వేల పుస్తకాలను డిజిటల్ లైబ్రరీల ద్వారా ప్రజలకు సులువుగా సేవలు అందించేందుకు డిజిటల్ లైబ్రరీ ఎంతో ఉపయోగంగా మారింది. డిజిటల్ లైబ్రరీ సేవలు అందించడానికి ఎంతో వ్యయ ఖర్చులు అవసరం. ప్రభుత్వం వీటిని కొనసాగించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది.

ప్ర : అన్నింటికీ సొంతభవనాలు ఉన్నాయి?

జ : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 72 గ్రంథాలయాలు ఉండగా 43 సొంత భవనాలు, 9 అద్దె భవనాలు, 18 అద్దె ఉచిత భవనాల్లో ఉన్నాయి. గ్రంథాలయాల సొంత భవనాల నిర్మాణానికి, స్థల సేకరణ, నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం

ప్ర : గ్రంథాలయాల్లో ఎన్ని పుస్తకాలు ఉన్నాయి?

జ : ఉమ్మడి అనంతపురం జిల్లాలో 767605 పుస్తకాలు ఉన్నాయి. అనంతపురం జిల్లా కేంద్రంలోనే 49,447 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఇవేకాక పాఠకుల డిమాండ్‌ను బట్టి పుస్తకాలు కూడా తెప్పిస్తున్నాం. నిరుద్యోగ యువతీ యువకుల అనువైన పోటీ పరీక్షలు సంబంధించి పుస్తకాలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చాం.

ప్ర : లైబ్రరీలో సభ్యత్వం పొందాలంటే ఎలా ? ఎంతమంది ఉన్నారు?

జ : ఉమ్మడి అనంతపురం జిల్లాలో 77,744 మంది సభ్యత్వం పొంది ఉన్నారు. ఒక్క అనంతపురం జిల్లా కేంద్రంలోనే 8,393 మంది సభ్యతం తీసుకున్నారు. రూ.వంద జమ చేస్తే రిజిస్ట్రేషన్ చేసి వారికి రెగ్యులర్‌గా పుస్తకాలు ఇంటికి తీసుకువెళ్లే వెసులుబాటు కల్పిస్తాం. తీసుకెళ్లిన పుస్తకాలు రెండు వారాల్లోపు తిరిగి గ్రంథాలయాలకు అందజేయాల్సి ఉంటుంది.

ప్ర : సిబ్బంది కొరత ఉందా?

జ : ఉమ్మడి అనంతపురం జిల్లాలో 73 మంది రెగ్యులర్ సిబ్బంది, 25 మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. 66 పోస్టులు ఖాళీలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా గ్రంథాలయాలకు 139 ముందు సిబ్బంది ఉండాల్సి ఉంది. ఖాళీలకు సంబంధించి ప్రభుత్వానికి తెలియజేశాం.

ప్ర : గ్రంథాలయాలకు సంబంధించి బకాయిలు ఉన్నాయా?

జ : ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ శాఖల నుంచి రూ.5,92,75,023 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఈ విషయాన్ని కలెక్టర్‌తోపాటు గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ దృష్టికి కూడా తీసుకెళ్లాం. ఇప్పటికే ఆయా శాఖలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. బకాయిలన్నీ సజావుగా అందితే గ్రంథాలయాల నుంచి మరింత విశిష్టమైన సేవలను అందిస్తాం.

ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ

చంద్రబాబు పాలనలో 'సీమ'కు అన్యాయం

కర్నూలు నుంచి లోకాయుక్త, హెచ్ఆర్సి తరలింపు తగదు -వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

వెనుకబడిన రాయలసీమకు ముఖ్యమంత్రి చంద్రబాబు అన్యాయం చేస్తున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. ఆదివారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రాయలసీమకు అన్యాయమే జరుగుతుందన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి కేంద్రం ఎయిమ్స్ కేటాయిస్తే దాన్ని అనంతపురంలో ఏర్పాటు చేస్తామని చెప్పి మంగళగిరికి తీసుకెళ్లారని మండిపడ్డారు. తిరుపతిలో క్యాన్సర్ ఆస్పత్రిని కేంద్రం మంజూరు చేస్తే దాన్ని కూడా కోస్తా జిల్లాలకు తరలించారని గుర్తు చేశారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల విషయంలోనూ చంద్రబాబు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. గతంలో హంద్రీనీవాను శంకుస్థాపనలకే పరిమితం చేశారని, వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం అయ్యాకే పనులు వేగవంతం అయ్యాయని తెలిపారు. కృష్ణాజలాలు 2012 నుంచి హంద్రీనీవా ద్వారా వస్తున్నాయంటే అది వైఎస్ఆర్ చలవేనని అన్నారు. కరువు ప్రాంతమైన రాయలసీమలో హంద్రీనీవా ప్రాజెక్ట్ లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్లను పట్టిసీమకు రాత్రికి రాత్రే తరలించిన ఘనత కూడా చంద్రబాబుదేనని గుర్తు చేశారు. హంద్రీనీవా సామర్థ్యం 3850 క్యూసెక్కులు ఉంటే 2200 క్యూసెక్కులే వస్తున్నాయని, దీన్ని 6200 క్యూసెక్కుల సామర్థ్యానికి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడే జీవో జారీ చేశారని గుర్తు చేశారు. కానీ నేడు కూటమి ప్రభుత్వంలో మళ్లీ 3850 క్యూసెక్కులకే పరిమితం చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై గతంలోనే ప్రభుత్వానికి లేఖ రాశామని, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తోనూ చర్చించినట్లు చెప్పారు. హంద్రీనీవా సామర్థ్యం 6200 క్యూసెక్కులకు విస్తరిస్తేనే రాయలసీమకు ప్రయోజనకరమని తెలిపారు. బడ్జెట్‌లో కూడా హంద్రీనీవాకు అరకొర కేటాయింపులే చేశారన్నారు. రాయలసీమ వాసిగా చెప్పుకుని రాజకీయంగా లబ్ధిపొందడమే గానీ చంద్రబాబు సీఎంగా ఉన్న ప్రతిసారీ సీమకు అన్యాయమే చేస్తున్నారని మండిపడ్డారు.

రాయలసీమ డిక్లరేషన్ ఏమైంది..?

రాయలసీమ అభివృద్ధి కోసం గతంలో బిజెపి రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించిందని గుర్తు చేశారు. అప్పట్లో రాయలసీమలో హైకోర్టు ఉండాలని చెప్పిన బిజెపి నాయకులు ఇప్పుడు ఏమయ్యారని ప్రశ్నించారు. బిజెపి ఎంపీగా, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్న పురంధరేశ్వరి చంద్రబాబు చేస్తున్న మోసాన్ని ప్రశ్నించరా? అని అడిగారు. కూటమిలో భాగస్వాములుగా ఉండి కూడా మౌనం పాటిస్తున్నారన్నారు. రాయలసీమకు చెందిన ప్రజాప్రతినిధులంతా సీఎం చంద్రబాబును కలిసి కర్నూలులోనే లోకాయుక్త, హెచ్ఆర్సీ ఉండేలా కోరాలన్నారు.

జగన్‌ను విమర్శించడానికే అసెంబ్లీ సమావేశాలు

కేవలం వైసిపి అధినేత జగన్‌ను విమర్శించడానికే అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఉందన్నారు. సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టి బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదని విమర్శించారు. బాబు ఎప్పుడు సీఎం కుర్చీలో కూర్చున్నా ఇచ్చిన హామీలను అమలు చేయరని ఎద్దేవా చేశారు. రాష్ట్ర అభివృద్ధి గురించి చర్చించకుండా కేవలం జగన్‌ను విమర్శించడానికే అసెంబ్లీ సమావేశాలను పెట్టుకున్నట్లు కనిపిస్తోందన్నారు.

అంటే అమరావతి, పోలవరమేనా...?

ఏపీ అంటే అమరావతి, పోలవరమేనా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందినప్పుడే ప్రాంతీయ అసమానతలు తొలగిపోతాయని చెప్పారు. శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం కర్నూలులో హైకోర్టు అనేది సీమ ప్రజల హక్కు అని తెలిపారు. అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందాలని, మరోసారి ప్రాంతీయ విభేదాలు రాకూడదని గత వైసిపి ప్రభుత్వం అడుగులు వేశారన్నారు. ఇందులో భాగంగానే కర్నూలును న్యాయ రాజధానిగా చేసుకుని లా యూనివర్సిటీ, లోకాయుక్త, ఎస్‌హెచ్ఆర్సీ ఏర్పాటుకు అడుగులు వేసినట్లు గుర్తు చేశారు. కానీ నేడు కూటమి ప్రభుత్వంలో అన్నీ అమరావతికే తరలిస్తుండటం బాధాకరమన్నారు. రాయలసీమ అభివృద్ధి కోసం ఇంకా కొత్త ప్రాజెక్టులు, కార్యాలయాలు తీసుకురావాల్సిందిపోయి ఉన్న వాటిని కూడా తరలించడం రాయలసీమకు ద్రోహం చేసినట్టేనని తెలిపారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరిగితేనే రాష్ట్రం సమగ్ర అభివృద్ధి చెందుతుందన్న విషయాన్ని చంద్రబాబు గుర్తించాలని సూచించారు. ఈ సమావేశంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాకే చంద్రశేఖర్, వైసిపి నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, పాల్గొన్నారు.

వైద్య విద్య సదస్సులే పరిశోధనలకు పునాది

వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నిరంతర వైద్యవిద్య సదస్సులే పరిశోధనలకు పునాది వంటివి అని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు అన్నారు. ఆదివారం నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల సుశ్రుత సెమినార్ హాలులో పెథాలజీ ప్రధాన విభాగాధిపతి ఆచార్య డాక్టర్ శివ శంకర్ నాయక్ అధ్యక్షతన చర్మవ్యాధి శాస్త్ర సమగ్ర విశ్లేషణపై నిరంతర వైద్యవిద్య సదస్సు నిర్వహించారు. ముందుగా చర్మ వ్యాధులు, పెథాలజీలో వాటి వ్యాధి శాస్త్రంపై సమగ్ర విశ్లేషణ చేయడానికి ముఖ్య వక్తలుగా విశ్వభారతి మెడికల్ కాలేజ్ పేథాలజీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ మైరెడ్డి నీరజ, సెయింట్ జాన్స్ మెడికల్ కాలేజ్ చర్మ వ్యాధి శాస్త్ర ప్రధాన విభాగాధిపతి డాక్టర్ రాజలక్ష్మి, పిఇఎస్ మెడికల్ కళాశాల కుప్పం పెథాజీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ ఏఎస్ రామస్వామి, శాంతిరామ్ మెడికల్ కళాశాల పేథాలజీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ జానకి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విపులంగా వివరించారు. ఈ సందర్భంగా ఎస్.మాణిక్యరావు మాట్లాడుతూ నిరంతర వైద్యవిద్య సదస్సులతోనే పరిశోధనలకు పునాది పడుతుందన్నారు. క్రమం తప్పకుండా ప్రతి విభాగం వైద్యులు నిరంతర వైద్య విద్యా సదస్సులను నిర్వహించనుండటం ద్వారా ఇక్కడ చదువుతున్న పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులకు ప్రపంచ స్థాయి వైద్యవిజ్ఞానం చేరువ అవుతుందన్నారు. ఇలాంటి మంచి అవకాశాలను పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నూతన పరిశోధనలు, నూతన చికిత్స పద్ధతులు, వ్యాధులు నివారణ పరిశోధనల ద్వారానే సాధ్యమవుతాయని, అందుకనే విద్యార్థులు చదువుతోపాటు పరిశోధనలపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి జోనల్ కోఆర్డినేటర్‌గా నంద్యాల మెడికల్ కళాశాల పెథాలజీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ బాలేశ్వరి, అబ్జర్వర్‌గా డెర్మటాలజీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ కిషోర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ నవీన్, ఆచార్య డాక్టర్ తెలుగు మధు, పెథాలజీ హెచ్ ఓ డి ఆచార్య డాక్టర్ శివ శంకర్ నాయక్, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ లక్ష్మి, డాక్టర్ భవాని, డాక్టర్ శ్రావణి, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ పూర్ణచంద్రశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ టి సి ఎస్ సుమన్ కుమార్, డాక్టర్ జె భాగ్యలక్ష్మి, డాక్టర్ దివ్య, డాక్టర్ అనిలా, డాక్టర్ దీప్తి, డాక్టర్ టిఆర్ఎస్ ఎన్ లక్ష్మి, డాక్టర్ శ్రీధర్ బాబు, డాక్టర్ చైతన్య, ట్యూటర్ డాక్టర్ మల్లిక దేవి, పెథాలజీ పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు, నాన్ టీచింగ్ స్టాఫ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తినాయుడుకి నివాళి

రామ్మూర్తినాయుడుకు నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్/రూరల్

నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి అధ్యక్షతన మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడుకు నివాళులర్పించారు. ఇందులో భాగంగా చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో విప్ కాలవ శ్రీనివాసులు, టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడుయాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, శింగనమల ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి టి.ఆదినారాయణ, కురుబ నారాయణస్వామి, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గౌస్‌మోద్దీన్, ఎపి రాష్ట్ర గాండ్ల సాధికార ఛైర్మన్ గాండ్ల విశాలాక్షి, సంగా తేజస్విణి, పార్లమెంటు కమిటీ సభ్యులు సరిపూటి రమణ, సుదర్శన్‌నాయుడు, నారాయణస్వామి యాదవ్, సుధాకర్‌యాదవ్, వై.వెంకటరామయ్య పాల్గొన్నారు.

అలాగే అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి సూచనల మేరకు ఆదివారం నగరంలోని అర్బన్ టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు నివాళులర్పించారు. ఇందులో భాగంగా చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనం పాటించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ రామ్మూర్తినాయుడు చంద్రగిరి ఎమ్మెల్యేగా అనేక సేవలు చేశారన్నారు. దీనికితోడు సోదరుడిగా చంద్రబాబుకు అండగా నిలిచి పార్టీకి అభివృద్ధికి పాటు పడ్డారన్నారు. ఈనేపథ్యంలో సుదీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చనిపోవడం బాధాకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్బన్ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు ఆధునిక సమాచార కేంద్రాలు

ఉరవకొండలో మాట్లాడుతున్న అతిథులు

ప్రజాశక్తి-ఉరవకొండ

గ్రంథాలయాలు ఆధునిక సమాచారం కేంద్రాలు అని గ్రంథాలయ అధికారి ప్రతాపరెడ్డి, ఉపాధ్యాయులు గోపాల్ సూచించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పురస్కరించుకుని ఉరవకొండలో గ్రంథాలయంలో విద్యార్థులకు గ్రంథాలయాల ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక ఇన్ఫర్మేషన్ సెంటర్లగా వినియోగంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్రూప్-2, ఐఎఎస్, ఐపిఎస్‌లతో పాటు కాంపిటేటివ్ ఎగ్జామ్స్ కు హాజరవుటకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులకు అవసరమైన లేటెస్ట్ గ్రూప్ వన్ గ్రూప్ టు కాంపిటీటివ్ పరీక్షలకు కావాల్సిన మెటీరియల్ గ్రంథాలయములో అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

రాప్తాడు : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు పి.లక్ష్మయ్య పుస్తక పఠనం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం సన్మాన గ్రహీత పి. లక్ష్మయ్య, తెలుగు ఉపాధ్యాయుడిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి.వీరనారాయణరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, శ్రీహరి, పి.సాయిప్రసాద్, విద్యార్థులు, పాల్గొన్నారు.

జాతరకు తొలగిన రహదారి అడ్డంకులు

చదును చేసిన రహదారి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

సంతే కొండాపురం పంచాయతీ సూగేపల్లి గ్రామంలో డిసెంబర్ 9న తేదీన జరిగే చెన్నమల్లేశ్వర జాతరకు ఎట్టకేలకూ అడ్డంకులు తొలగించినట్లు సర్పంచి వనితా మల్లికార్జున తెలిపారు. ఆదివారం ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ సూగేపల్లి గ్రామంలో జరిగే జాతర సందర్భంగా జాతరకు వచ్చే ప్రయాణికులు, వాహన రాకపోకలకు ఎలాంటి అంతరాయాలు, అవాంతరాలు ఏర్పడకుండా తాత్కాలిక రోడ్డు మరమ్మతులు చేపట్టి మార్గాన్ని సుగమనం చేశామన్నారు. దీంతో సూగేపల్లి, కొండాపురం, కోనాపురం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆమె వెంట పెంకుల మల్లికార్జున, అక్కన్న, డీలర్ నల్లమల్ల, జెసిబి సీనప్ప, అంకే ఓబులేష్, పాపంపల్లి తిప్పేస్వామి, మాజీ ఎంపీటీసీ కరే గౌడ, స్కూల్ కమిటీ ఛైర్మన్ కరేగౌడ, దండు తిప్పేస్వామి ఉన్నారు.

విద్యపై అవగాహన

కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని కెఎం ఫంక్షన్ హాల్లో ముస్లిం మదరసాలు, పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సున్ని స్టూడెంట్ ఫెడరేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఈ సంస్థ చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ముస్లిం విద్యార్థులు ధార్మిక విద్యతో పాటు ప్రాపంచిక విద్యను గూడ అభ్యసించే విధంగా కార్యక్రమాలు రూపొందించారు. కార్యక్రమానికి మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు హాజరు అయ్యారు. ఇందులో ఎన్నికైన విద్యార్థులు జాతీయ స్థాయిలో ఈనెల 29, 30, డిసెంబర్ 1న గోవాలో జరుగు పోటీ పరీక్షల్లో పాల్గొనునున్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ ఎపి రాష్ట్ర అధ్యక్షులు ముఫ్తీ మొహమ్మద్ మన్సూర్ అలీ, రాష్ట్ర కార్యదర్శి శ్యాంసుద్దీన్, వైసిపి పట్టణ కన్వీనర్ డి. హుస్సేన్ పీరా, టిడిపి పట్టణ అధ్యక్షులు ఎంకె. చౌదరి, నాయకుడు చికెన్ శీనా, హెచ్‌కెజిఎన్ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాతిదూలం లాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

గజ గౌరీ పండుగ సందర్భంగా ఆదివారం మండలంలోని ఉద్దేహల్ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్ లో రాతిదూలం పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో ఆత్మకూరు మండలం తోపుదుర్తికి చెందిన మాధవరాజులు ఎద్దులు మొదటి బహుమతి, బళ్లారి ఆంధ్రాల ఆనందరెడ్డికి చెందిన ఎద్దులు ద్వితీయ బహుమతి సాధించాయి. ఆయా ఎద్దుల యజమానులకు ఆలయ పెద్దలు బహుమతులు అందజేశారు.

అహుడా ఛైర్మన్‌కు అభినందనలు



వరుణ్‌ను అభినందిస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

ఇటీవల అహుడా ఛైర్మన్‌గా ఎన్నికైన జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్‌ను ఆ పార్టీకి చెందిన శింగనమల మండల అధ్యక్షులు తోట ఓబులేసు, యువనాయకులు రామ్మోహన్ ఆదివారం జిల్లాకేంద్రంలోని రామ్‌నగర్‌లో ఉన్న కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి, శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి చొప్పా చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చర్చి శత వార్షికోత్సవ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని సిఎస్ఐ చర్చి శత వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే యామినీబాల, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, సోదరుడు గుమ్మనూరు నారాయణ, టిడిపి పట్టణ అధ్యక్షులు ఎంకె.చౌదరి హాజరయ్యారు. ఈ సందర్భంగా చర్చిలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చర్చి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గుమ్మనూరు ఈశ్వర్, నారాయణ రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఐ టౌన్ చర్చి సంఘం కార్యదర్శి సురేంద్రబాబు, నాయకులు సిబిజె, రసెల్ కిరణ్, బింగి కిరణ్, దయానంద్, ప్రేమ్‌కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

పట్టణంలోని మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి పత్తి రైతులను నాదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు రాజారామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మార్కెట్ సౌకర్యం, కొనుగోలు కేంద్రాలు లేక పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పత్తిరైతులపై దృష్టి సారించి తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ గిట్టుబాటు ధర రూ.7521 ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. ఈ మొత్తానికి అదనంగా రూ.2,500 జమ చేసి బోనస్‌గా కింటాకు రూ.10 వేలు ఇవ్వాలని కోరారు. పత్తి కొనుగోలు చేసిన పదిరోజుల్లోపు పరిహారాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు.

వజ్రాల సుంకులమ్మ విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-బెలుగుప్ప

మండల పరిధిలోని దుద్దేకుంట గ్రామంలో వజ్రాల సుంకులమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. దుబ్బవారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సేకరించిన విరాళాలతో అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున వేద పండితులు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. తర్వాత అభిషేకాలు, హోమలు, పూజలు చేశారు. మహిళలు, చిన్నారుల దీపాలతో ఊరేగింపుగా మొక్కులు చెల్లించుకున్నారు.

IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE, ANANTAPURAMU
I.A.No.261/2024, I.A.No.262/2024 in O.S.No.07/2023

Between:
B.Ramachandra Prasad ...Petitioner/Defendant
And
T.Purushotham Naidu ...Respondent/ Plaintiff

NOTICE TO RESPONDENT

To.
T.Purushotham Naidu, S/o.T.Narayana Swamy, Flat No.501, Sairam Residency, Aravinda Nagar, Anantapuramu.

పై నెంబరు కేసులో రెస్పాండెంటు అయిన మీ హాజరు నిమిత్తం **21-11-2024**వ తేది ఉదయం 10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆరోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గాని పైకోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పైకేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
K.PADMANARAYANA REDDY,
Advocate, Anantapuramu.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE, ANANTAPURAMU
E.P.No.85/2019, O.S.No.362/2006

Between:
M/s.Chalapathi Chit Fund (P) Ltd.,
Anantapuramu.
Rep by its Manager/ Foreman ...D.Hr
And
S.Muralidhar Rao and Others ...J.Drs

1వ J.Dr కు సేల్ నోటీసు

J.Dr. No.1 :
Sapare Muralidhar Rao, S/o.S.Govindarajulu, R/at.H.No.12/2-784, Ashok Nagar, Anantapuramu.

పై నెంబరు E.Pలో 1వ J.Dr కు సేల్ నోటీసు కొరకు హాజరు నిమిత్తం **22-11-2024**వ తేది ఉదయం 10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆరోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పైకోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
బోయపాటి రాజశేఖర్, D.Hr అడ్వకేటు,
అనంతపురం. సెల్: 9440289779

IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL (THE HON'BLE DISTRICT JUDGE) ANANTHAPURAM
M V.O.P.No:106/2024

Between:
Nituri Rukmini, W/o N.Pakkira Reddy, age 59 years, D.No 1-4-654 HLC Colony, Opposite BSNL Quarters, Ananthapuram. ... **Petitioner**
AND
Nakka Gouri Shankar and another ... **Respondents**

Notice to Respondant No:1
R1. Nakka Gouri Shankar, S/o Pullaiah, D.No. 1-1451, Chakali Veedi, Pamidi, Ananthapuram.
Owner cum Driver of AP-29-SK-4186

Please take notice that the above claim petitioners filed the above O. P. No. 107/24 against you and others for grant of compensation and the same is posted to **26-11-2024** for your appearance. You are hereby directed to appear before the Hon'ble Court on **26-11-2024 at 10-30 a.m.** in person or through an Advocate without fail. If you fail the matter will be decided exparte.
(By the order of the Court)
P.Kavitha,Advocate,
Ananthapuram. Cell:7416857479

IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL (THE HON'BLE DISTRICT JUDGE) ANANTHAPURAM
M V.O.P.No:107/2024

Between:
Nituri Pakkira Reddy, S/o N. Bayapa Reddy, age 59 years, D.No 1-4-654 HLC Colony, Opposite BSNL Quarters, Ananthapuram. ... **Petitioner**
AND
1.Nakka Gouri Shankar and another ... **Respondents**

Notice to Respondant No:1
R1. Nakka Gouri Shankar, S/o Pullaiah, D.No. 1-1451, Chakali Veedi, Pamidi, Ananthapuram.
Owner cum Driver of AP-29-SK-4186

Please take notice that the above claim petitioners filed the above O. P. No. 107/24 against you and others for grant of compensation and the same is posted to **26-11-2024** for your appearance. You are hereby directed to appear before the Hon'ble Court on **26-11-2024 at 10-30 a. m.** in person or through an Advocate without fail. If you fail the matter will be decided exparte.
(By the order of the Court)
P.Kavitha, Advocate,
Ananthapuram. Cell:7416857479

న్యాయవాది దీపక్ దయానంద్‌కు డాక్టరేట్

డాక్టరేట్ అందుకుంటున్న దీపక్ దయానంద్

ప్రజాశక్తి-గుత్తి

విశ్రాంత రైల్వే అధికారి, శ్రీ బాల సుబ్రహ్మణ్యం కల్చరల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జ్ఞాన శేఖర్ కుమారుడు, హైకోర్టు న్యాయవాది దీపక్ దయానంద్‌కు డాక్టరేట్ (పిహెచ్‌డి) దక్కింది. దీపక్ దయానంద్ చేసిన సామాజిక సేవ కార్యక్రమాలను గుర్తించిన అమెరికన్ యూనివర్సిటీ చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు డాక్టర్ రావడం ఆనందదాయకమన్నారు. తన కుటుంబ సభ్యులు, స్నేహితులు మద్దతుగా నిలవడం తనకు మనోధైర్యాన్ని ఇచ్చిందని చెప్పారు. దీపక్ దయానంద్ కు డాక్టరేట్ రావడం పట్ల పలువురు అభినందించారు.

జోరుగా టిడిపి సభ్యత్వ నమోదు

సభ్యత్వ నమోదులో పాల్గొన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పామిడి

స్థానిక 13, 15వ వార్డుల్లో టిడిపి రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సభ్యత్వ నమోదు చేపట్టారు. మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ సూచనలతో సాగుతున్న సభ్యత్వ నమోదుకు మంచి స్పందన వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ మాజీ అధ్యక్షులు బొమ్మా మోహన్, పత్రా సీనా, అప్పన్నగారి కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, హుస్సేన్‌పీరా, భాస్కర్, అలీ, నారాయణస్వామి, దొడ్డప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎఐఎస్ఎ కన్వీనర్‌గా కె.భీమేష్

ప్రజాశక్తి-ఉరవకొండ

నియోజకవర్గ ఆలిండియా స్టూడెంట్ అసోసియేషన్ కన్వీనర్‌గా భీమేష్‌ను నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేమన తెలిపారు. ఆదివారం ఉరవకొండలో అలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై ఎఐఎస్ఎ నిరంతరం రాజీలేని ఉద్యమాలను కొనసాగిస్తుందన్నారు. విద్యా వ్యతిరేక విధానాలపై దేశ రాజధాని ఢిల్లీలో సైతం పోరాటాలు చేసిన ఘతన ఎఐఎస్ఎకు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు చరణ్, రాజేష్, శ్రీరామ్, నరసింహా, వంశీ, సాగర్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

టమోటా రైతులు బీమా ప్రీమియం చెల్లించాలి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలో టమోటా సాగు చేసిన రైతులందరూ తప్పకుండా బీమా ప్రీమియం చెల్లించుకోవాలని ఉద్యానవన అధికారి కృష్ణతేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రబీలో టమోటా సాగు చేసే రైతులు ఈ-పంట నమోదుతోపాటు ఎకరాకు రూ.1,600 చొప్పున డిసెంబర్ 15లోగా ప్రీమియం చెల్లిస్తే బీమా వర్తిందన్నారు. బీమా చెల్లించిన తర్వాత పంట నష్టం సంభవిస్తే ఎకరాకు రూ.32వేలు బీమా వర్తిస్తుందని తెలిపారు. కావున రైతులు కామన్ సర్వీస్ సెంటర్‌గానీ, రైతు సేవాకేంద్రాలకుగానీ వెళ్లి భూమి-1బి, ఆధార్, బ్యాంక్ అకౌంట్, పంట ధ్రువీకరణ పత్రాలు సమర్పించి ప్రీమియం చెల్లించవచ్చన్నారు. మరిన్ని వివరాలకు అగ్రికల్చర్ బీమా కంపెనీ జిల్లా మేనేజర్ కృష్ణసాగర్ సెల్..99122 75799ను సంప్రదించాలని కోరారు.

ఉచిత శస్త్రచికిత్స శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-యాడికి

మండల కేంద్రంలోని కోన రోడ్డులో ఉన్న శ్రీవివేకానంద హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన శస్త్ర చికిత్స శిబిరానికి అనూహ్య స్పందన లభించింది మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్, వేడుకాపుర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 103 మందికి మాతృశ్రీ ఆసుపత్రి వైద్యులు వివిధ రకాలు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ ఆసుపత్రి వైద్యులు ప్రశాంత్ రెడ్డి, గైనకాలజిస్ట్ లలితాదేవి, గుత్తి మాతాశ్రీ ఆసుపత్రి మేనేజర్ రాజశేఖర్, సిబ్బంది రాజేష్, ప్రసన్నకుమార్, సురేష్, విజయలక్ష్మి, యశోద, యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ మరియు వేడుకాపుర ఫౌండేషన్ సభ్యులు బండారు బాలకృష్ణ, ఆలూరు చంద్రశేఖర్‌రెడ్డి, చింతా నరసింహా, బడిగించల వేణు, సాకరే శంకరప్ప, సాకరే శ్రీనివాసులు, గాంధీజీ స్కూల్ రామమోహన్, ఎద్దుల పుల్లయ్య, గుత్తి బ్రాంచి ప్రెసిడెంట్ కాయపాటి నరేష్‌యాదవ్, పెద్దవడుగూరు బ్రాంచి ప్రెసిడెంట్ పర్లపాటి మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోటి దీపోత్సవం

ప్రజాశక్తి-ఆత్మకూరు

కార్తీకమాసం మూడవ ఆదివారాన్ని పురస్కరించుకుని మండల పరిధిలో పంపనూరు గ్రామంలో వెలసిన సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో కోటి దీపోత్సవం కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. ఇందులో భాగంగా లక్ష్మీనారాయణస్వామి, తులసీ అమ్మవారికి కళ్యాణం నిర్వహించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి కేశవనాయుడు, డిఎల్‌డిఒ సుమన జయంతి, ఎంపిడిఒ జి.లక్ష్మీనరసింహా, తహశీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపిడిఒ లక్ష్మీనరసింహా, ఎస్ఐ లక్ష్మీనారాయణ, ఇఒఆర్‌డి కామాక్షి శైలజరాణి, ఆనంద్, సదాశివ, కార్యదర్శులు మహబూబ్‌బాషా, శిరీషా, మూకాంబికసాంబ, చంద్రశేఖర్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నగర్‌లో మైలార లింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఇందులో భాగంగా అర్చకుల మంత్రోచ్చరణలతో మహిళలు, భక్తులు భూమిపూజ చేశారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ పూజలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గణాచార్యులు, గోరవయ్యల నృత్యాలు ఆకట్టుకున్నాయి. తర్వాత ఆలయ కమిటీ సభ్యులు ఆనందు, మల్లేష్, శ్రీనివాసులు, రామకృష్ణ, కృష్ణ, నాగరాజు, వన్నూరుస్వామి, భక్తులకు ప్రసాదాలు అందించారు.

నేరాలు ఘోరాలు

మద్యం మత్తులో కింద పడి యువకుడి మృతి

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో దిలిప్ సాకేత్ అనే యువకుడు మద్యం మత్తులో రోడ్డుపై కింద పడి మతిచెందాడు. తోటి కూలీలు తెలిపిన వివరాల మేరకు.. మధ్యప్రదేశ్‌లోని అమర్పతన్ తహసీల్ పారస్వహీ గ్రామానికి చెందిన దిలీప్ సాకేత్ అనే యువకుడు మండలంలోని కొత్తపేట గ్రామ శివారులోని పెద్దవడుగూరు మండలం వెంకటాంపల్లి గ్రామ సమీపంలో ఉన్న శివకష్ణ కన్స్ట్రక్షన్ కంపెనీలో స్టోర్ లేబర్ గా పని చేసేవాడు. ఈక్రమంలో శనివారం రాత్రి కొత్తపేట గ్రామ శివారులో జాతీయరహదారి పక్కన ఉన్న హోటళ్లలో పూటుగా మద్యం తాగి భోజనం చేసిన అనంతరం తోటి కూలీలతో కలిసి నడిచి వెళ్తూ కింద పడిఅపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కూలీలు మద్యం మత్తులో ఉన్నాడేమా అని వారి క్యాంపు వద్ద ఉన్న బొలేరో వాహనాన్ని రప్పించి తీసుకెళ్లి పడుకోబెట్టారు. అయితే ఆదివారం ఉదయం 9 గంటలు అవుతున్నా నిద్ర లేవకపోవడంతో అనుమానం వచ్చిన తోటికూలీలు వెంటనే చికిత్స నిమిత్తం దిలీప్‌ను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా దిలీప్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



గాయపడిన మారెన్న

డి.హీరేహాల్ : మండల పరిధిలోని ఓబులాపురం గ్రామ చెక్‌పోస్టు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మారెన్నకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మంగళూరు నుంచి బళ్లారి వైపు వెళుతున్న ఓ ప్రయివేటు బస్సు బళ్లారి నుంచి హీరేహాల్ వైపు వస్తున్న ఒక ఆటోను ఢీకొంది. దీంతో ఆటో డ్రైవర్ మారెన్నకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం బళ్లారి విమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.